కాలం.. కల్లోలం

దేశవ్యాప్తంగా వాతావరణంలో తీవ్ర అనిశ్చితి

- పర్యావరణ మార్పులతో ప్రతికూల పరిస్థితులు
- జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య 235 రోజులు ప్రభావం
- ప్రతి రోజు సగటున 10 మంది మృతి
- 45 లక్షల ఎకరాల్లో పంటనష్టం
- తెలంగాణలో 52 రోజులపాటు కనిపించిన ప్రభావం



హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ పండుగ నాటికే చలికాలం మొదలై పొగమంచు కురిసేది. చలిలో గజగజ వణుకుతూ వెళ్లి పువ్వు తెంపుకొచ్చేది. దీపావళికి చలి జోరు పెరిగి చలి మంటలు మొదలయ్యేవి. ఇక కార్తీక పౌర్ణమికి వేకువజామున లేచి స్నానం చేయాలన్న ఆలోచనకే వణుకు పుట్టేది. కానీ ఈసారి వాతావరణం పూర్తి భిన్నంగా ఉన్నది. దసరాకు చలి మొదలు కాలేదు. కార్తీక పౌర్ణమి దాటినా పెద్దగా పొగమంచు లేదు. ఎందుకిలా? జూన్‌లో వర్షాలు ప్రారంభం కావాల్సి ఉన్నా, ఈ ఏడాది జూన్‌లో నల్లగొండ జిల్లాలో రికార్డు స్థాయిలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే నెలలో యూపీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో వడదెబ్బకు రెండు, మూడు రోజుల్లోనే 100 మంది వరకు మరణించారు. ఇదే సమయంలో ఈ ఏడాది జూలైలో ములుగు జిల్లాలో 24 గంటల్లోనే 64.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని కుండపోత ఇది. ఈ ఏడాది దేశంలో ప్రతి రోజు ఏదో ఒక చోట ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు కనిపించాయి. అకాల వర్షాలు, వరదలు, వానకాలంలో వడగాడ్పులు, వర్షాలు కురవాల్సిన సమయంలో కరువు పరిస్థితులు, చలికాలంలో ఉక్కపోతలు.. ఇలాంటి విపత్కర పరిస్థితులన్నింటికీ మూలం పర్యావరణ మార్పులే. దేశంలో ఈ ఏడాది ప్రారంభం నుంచి వాతావరణ మార్పులు ఇబ్బంది పెడుతూనే ఉన్నట్టు డౌన్ టు ఎర్త్ అనే సంస్థ తాజాగా విడుదల చేసిన ఓ నివేదిక స్పష్టం చేసింది. తొమ్మిది నెలల్లో 273 రోజులకుగానూ 235 రోజులు దేశంలో కల్లోల పరిస్థితులు నమోదైనట్టు పేర్కొన్నది. ఈ లెక్కన 86 శాతం రోజులు ప్రతికూల వాతావరణమే కనిపించింది. అంటే.. దాదాపు ప్రతిరోజు దేశంలో ఏదో ఒక చోట వాతావరణ మార్పులు ప్రభావం చూపాయి. రోజుకు సగటున 10 మంది మరణించారని నివేదిక చెప్తున్నది. రాష్ట్రాల వారీగా పరిశీలించినప్పుడు వాతావరణ మార్పుల ప్రభావం మధ్యప్రదేశ్‌పై ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. అక్కడ ఏకంగా 138 రోజులపాటు ప్రతికూల పరిస్థితులు నమోదయ్యాయి. ఇక దేశంలోనే అత్యధికంగా బీహార్‌లో 642 మరణాలు సంభవించాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో అత్యధిక ఇండ్లు (15,407) ధ్వంసం కాగా, పంజాబ్‌లో అత్యధికంగా జంతువులు (63,649) మృత్యువాతపడ్డాయి.

- దేశవ్యాప్తంగా తొమ్మిది నెలల్లో సుమారు 176 రోజుల్లో పిడుగులు, తుఫాన్లతో కూడిన వాతావరణం నమోదైంది. తుఫాన్లు, పిడుగుల కారణంగా 711 మంది మరణించారు.
- భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలు 132 రోజులపాటు నమోదయ్యాయి. ఫలితంగా 1,903 మంది మరణించారు.
- దేశవ్యాప్తంగా సగటున 49 రోజులపాటు వడగాడ్పులు నమోదయ్యాయి. మొత్తం 201 మంది మరణించారు. ఇందులో 150 మరణాలు ఉత్తరప్రదేశ్‌లోనే జరిగాయి. అంటే నాలుగింట మూడొంతులు.
- ఈ ఏడాది ఫిబ్రవరి, ఆగస్టులో గత 122 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యాయి.

తొమ్మిది నెలల్లో వాతావరణ మార్పుల ప్రభావం

మొత్తం రోజులు	ప్రతికూల వాతావరణం నమోదైన రోజులు
273	235
మానవ మరణాలు 2,923	
పంట నష్టం 45.46 లక్షల ఎకరాలు	
ధ్వంసమైన ఇండ్లు 80,563	జంతువుల మృతి 92,519

తెలంగాణలో 52 రోజులు

జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య తెలంగాణలో 52 రోజులపాటు కల్లోల పరిస్థితులు నెలకొన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. ముఖ్యంగా ఏప్రిల్‌లో అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాల కారణంగా సుమారు 5 వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. ఆ నెలలో దేశవ్యాప్తంగా 5,772 ఎకరాల్లో పంట నష్టం నమోదవగా.. తెలంగాణలోనే 87 శాతం ఉండటం గమనార్హం.

- రాష్ట్రంలో తొమ్మిది నెలల్లో సుమారు 21 రోజులపాటు తుఫాన్లు, పిడుగులతో కూడిన కల్లోల వాతావరణం నమోదైంది. వీటి కారణంగా 10 మరణాలు నమోదయ్యాయి.
- 20 రోజులపాటు భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటివి నమోదయ్యాయి. మొత్తం 23 మంది మరణించారు.
- 13 రోజులపాటు వడగాడ్పులు నమోదు కాగా, ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఒక్క మరణం కూడా నమోదు కాలేదు.
- 2022లో తెలంగాణలో 42 రోజులు ప్రతికూల వాతావరణం నమోదు కాగా.. ఈసారి 10 రోజులు పెరిగింది.

తెలంగాణలో వాతావరణ మార్పుల ప్రభావం

మానవ మరణాలు	33
ఎకరాలు పంట నష్టం	1.55 లక్షల
ధ్వంసమైన ఇండ్లు	5,193
జంతువుల మృతి	252

ల్యాండ్‌మైన్‌ను నిర్మానుష్య ప్రాంతంలో బ్లాస్ట్ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

మావోయిస్టుల మాస్టర్ ప్లాన్ భగ్నం

- ల్యాండ్ మైన్ నిర్వీర్యం

కొత్తగూడెం క్రైం/చర్ల, డిసెంబర్ 1: పీఎల్‌జీఏ 23వ వార్షికోత్సవ వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు పోలీస్ బలగాలను టార్గెట్ చేశారు. వారి ప్లాన్‌ను భగ్నం చేస్తూ భద్రాద్రి జిల్లా పోలీసులు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో అమర్చిన 40 కిలోల ల్యాండ్ మైన్‌ను నిర్వీర్యం చేశారు. ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులను టార్గెట్ చేస్తూ చర్ల మండల పరిధిలోని పెద్ద బీడిసిలేరు అటవీ ప్రాంతానికి వెళ్లే రహదారిలో 40 కిలోల ల్యాండ్ మైన్‌ను అమర్చారు. విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం అందుకున్న పోలీస్ శాఖ బాంబ్ స్క్వాడ్ సహకారంతో గురువారం సాయంత్రం ల్యాండ్‌మైన్‌ను గుర్తించారు. శుక్రవారం ల్యాండ్‌మైన్‌ను నిర్మానుష్య ప్రాంతానికి తరలించి బ్లాస్ట్ చేసి పెనుముప్పును తప్పించారు. ఎన్నికల విధులకు హాజరై తిరిగి వెళ్లే బలగాలను టార్గెట్ చేస్తూ ఈ ల్యాండ్‌మైన్ పెట్టారని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే.. ఆదివాసీలు ఓటేయకుండా మావోయిస్టులు అనేక రకాలుగా బెదిరించారని, అయినప్పటికీ 90 శాతం ఆదివాసీలు పోలీస్ శాఖపై ఉన్న నమ్మకంతో ఓటేసి తమ చైతన్యాన్ని చాటారని ఎస్పీ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సహకరించిన సీఆర్పీఎఫ్ బలగాలను ఆయన అభినందించారు.

పరీక్ష లేకుండా ప్రవేశాలు!

- ప్రవేశాలపై కసరత్తు
- టెక్స్‌టైల్ టెక్నాలజీ, మైనింగ్ వంటి ఎంటెక్ కోర్సులు
- అధ్యయనానికి నలుగురు సభ్యులతో కమిటీ

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని కొన్ని పీజీ ఇంజినీరింగ్ (ఎంఈ, ఎంటెక్) కోర్సులకు ప్రవేశ పరీక్షలేకుండా ప్రవేశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో6 పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్ టెస్ట్ (పీజీఈ సెట్)లో కొన్ని పరీక్షలు రద్దు కానున్నాయి. వీటిలో టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఎరోనాటికల్ ఇంజినీరింగ్, మెటలర్జీ వంటి కోర్సుల ప్రవేశ పరీక్షలు ఉన్నాయి. పరీక్షల్లేకుండా ప్రవేశాలు కల్పించే విధానంపై తెలంగాణ ఉన్నత విద్యామండలి ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, పీజీఈసెట్ పూర్వ కన్వీనర్ రవీంద్రారెడ్డి ఉన్నారు. ఈ కమిటీ పలు సిఫారసులు చేయనుండగా, వాటిని ప్రభుత్వానికి సమర్పిస్తారు. ప్రభుత్వం ఆయా ప్రతిపాదనలకు ఆమోదిస్తే జీవో జారీ అవుతుంది. ఈ మేరకు 2024 – 25 సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. పీజీఈసెట్‌ను మొత్తం 19 సబ్జెక్టులకు నిర్వహిస్తుండగా, పలు కోర్సుల్లో సీట్లు ఎక్కువుండటం ప్రవేశ పరీక్షకు హాజరయ్యేవారు తక్కువగా ఉండటంతోనే ఈ దిశగా అడుగులేస్తున్నారు.

- ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, ఫార్మసీ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు పీజీఈసెట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ యేడులో 27 కాలేజీల్లో 718 ఏరోనాటికల్ ఇంజినీరింగ్ సీట్లుంటే నలుగురు విద్యార్థులు అర్హత సాధిస్తే వారిలో ఒక్కరు కూడా చేరలేదు.
- టెక్స్‌టైల్ టెక్నాలజీలో 18 సీట్లుంటే 8మంది పీజీఈసెట్‌లో అర్హత సాధించగా, ఒక్కరూ చేరలేదు.
- మెటలర్జీకి ఒక కాలేజీలో 30 సీట్లుంటే ఐదుగురే అడ్మిషన్స్ పొందారు.
- కెమికల్ ఇంజినీరింగ్‌లో 138 సీట్లుంటే 20 సీట్లే భర్తీ అయ్యాయి.
- సీఎస్ఈ, ఈసీఈ, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఎం ఫార్మసీ వంటి పీజీ కోర్సులకు డిమాండ్ తీవ్రంగా ఉండగా, వీటికి ప్రవేశ పరీక్షను నిర్వహించి, సీట్లను భర్తీచేస్తారు.

పీఈసెట్‌కు రాత పరీక్ష..

బీపీఈడీ, యూజీ డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పీఈసెట్ పరీక్షా విధానం మార్చే అవకాశం ఉన్నది. ప్రస్తుతం 2004లో ఇచ్చిన జీవో 168 ప్రకారం అభ్యర్థులకు శారీరక దారుఢ్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. తాజాగా ఈవెంట్స్‌కు బదులుగా రాత పరీక్షను నిర్వహించే అంశంపై ఉన్నత విద్యామండలి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు అధ్యయనం చేసేందుకు కమిటీని నియమించారు. ఈ కమిటీలో పాలమూరు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ రాజేశ్‌లు సభ్యులుగా ఉన్నారు.

ఫిబ్రవరిలో ఎస్ఎస్ఏ పీఏబీ సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు (పీఏబీ) సమావేశం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్నది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ అధికారులు.. రాష్ట్ర ఎస్ఎస్ఏ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఏటా ఏప్రిల్‌లో ఎస్ఎస్ఏ పీఏబీ సమావేశం నిర్వహించి, వచ్చే విద్యాసంవత్సరంలో చేపట్టే పథకాలు, కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించి, ఆమోదిస్తారు. అయితే, ఈ ఏడాది పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరిలోనే నిర్వహించేందుకు ఎస్ఎస్ఏ షెడ్యూల్‌ను రూపొందించింది. జనవరి 15లోపు రాష్ట్ర ఎస్ఎస్ఏ అధికారులు ప్రతిపాదనలను రూపొందించి, సమర్పించేందుకు కేంద్ర విద్యాశాఖ అవకాశం ఇచ్చింది.

11 వరకు ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : 2023– 24 విద్యాసంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రవేశాల (టాస్) గడువును ఈ నెల 11 వరకు అధికారులు మరోమారు పొడిగించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ డైరెక్టర్ పీవీ శ్రీహరి తెలిపారు. వివరాలకు ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

12న ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్ష

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షను ఈ నెల 10న నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 : 30 గంటల నుంచి మధ్యాహ్నం 12 : 30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను https//bse.telanangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో జ్యోతిప్రజ్వలన చేసిన నాప్‌కాన్ 25వ జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్, నిర్వాహకులు

శ్వాసకోశ వైద్యనిపుణుల సేవలు ప్రశంసనీయం

గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మానవాళికి శ్వాసకోశ వైద్యనిపుణులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని శ్వాసక్రియ యోగి, గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీలోని నోవాటెల్ హోటల్‌లో ప్రతిష్ఠాత్మక శ్వాసకోశ నిపుణుల నాప్‌కాన్–2023.. 25వ జాతీయ సదస్సు నిర్వహించారు. మూడురోజుల పాటు జరిగే సదస్సులో భాగంగా శుక్రవారం సుదర్శన క్రియా యోగాను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. శ్వాసకోశ సంబంధిత పరిశోధనల ఫలితాలు ప్రజలందరికీ చేరాలని సూచించారు. భారతీయ యోగ సాధకుల శ్వాస ప్రక్రియలపై అధ్యయనాలు జరగాలని పేర్కొన్నారు. అనంతరం పలువురు వైద్యనిపుణులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. సదస్సు నిర్వాహక కార్యదర్శి, కామినేని దవాఖాన శ్వాసకోశ విభాగాధిపతి డాక్టర్ శుభాకర్ కంది మాట్లాడుతూ.. శ్వాసకోశ వైద్య నిపుణులను, అధ్యయనకర్తలను ఒక దగ్గరకు చేర్చేందుకు ఈ నాప్‌కాన్ వేదిక ఉపయోగపడిందని తెలిపారు. శ్వాసకోశ విజ్ఞానంలోని సరికొత్త విషయాలను పంచుకొని, పరస్పర సహకారం, సమన్వయం ద్వారా ప్రగతి సాధించేందుకు ఉద్దేశించిన ఈ సదస్సుకు 65 దేశాల నుంచి 3వేలకు పైగా వైద్యులు, పరిశోధకులు హాజరయ్యారని వివరించారు. ఇండియన్ చెస్ట్ సొసైటీ, నేషనల్ కాలేజీ ఆఫ్ చెస్ట్ ఫిజీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఆర్ విజయకుమార్, పద్మశ్రీ డాక్టర్ ఫారుఖీ, పద్మశ్రీ డాక్టర్ కిషన్, డాక్టర్ రణ్ దీప్ గులేరియా, డాక్టర్ దీపక్ తల్వార్, డాక్టర్ గౌతమ్ భగత్, డాక్టర్ ఎస్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వేకు రెండు అవార్డులు

15న ఢిల్లీలో అవార్డు అందించనున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): సివిల్ ఇంజినీరింగ్ విభాగం, నిర్మాణానికి సంబంధించి రెండు విభాగాల్లో దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) రెండు 'పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ షీల్డ్–2023' అవార్డులు సాధించినట్టు అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఈ అవార్డును ఈ నెల 15న ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఎస్సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అందజేయనున్నారు.

వన్యప్రాణుల వేట నిరోధానికి స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వన్యప్రాణుల వేటను నిరోధించేందుకు అటవీశాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. శుక్రవారం నుంచి 'క్యాచ్ ద ట్రాప్' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు ఈ ప్రత్యేక డ్రైవ్‌లో వీలైనన్ని అటవీ ప్రాంతాలను పరిశీలించడం ద్వారా వేటగాళ్లను గుర్తిస్తారు. వేటగాళ్లు వాడే పరికరాలను స్వాధీనం చేసుకోవడం, గత రికార్డులు, కేసులను పరిశీలించి అనుమానితులను సోదా చేస్తారు. అడవి సమీప ప్రాంతాలను, వ్యవసాయ క్షేత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అత్యుత్తమ పనితీరు కనబరిచే క్షేత్రస్థాయి సిబ్బందికి సరైన ప్రోత్సాహం కల్పిస్తారు. ఇన్‌ఫార్మర్లను, వారి గుర్తింపును రహస్యంగా ఉంచడంతోపాటు వారికి తగిన రివార్డులు ఇవ్వనున్నారు. చట్ట విరుద్ధమైన వేట, అందుకోసం ఉపయోగించే వస్తువులకు సంబంధించిన ఏదైనా సమాచారం తెలిస్తే సంబంధిత జిల్లా అటవీ అధికారికి లేదా 98033 38666, టోల్ ఫ్రీ నంబర్ 1800 4255364కు తెలపాలని అటవీశాఖ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వెల్లడించారు. రాష్ట్రంలో వలలు, ఉచ్చులు, లైవ్ వైర్లు, విషం, పేలుడు పదార్థాలు మొదలైన వాటిని ఉపయోగించి అటవీ జంతువులను చంపడం, వేటాడటాన్ని అటవీశాఖ నిషేధించింది. వన్యప్రాణులను చంపడం, వేటాడే ప్రయత్నాలనూ నిరోధించాలని నిర్ణయించింది.

శుక్రవారం సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి. చిత్రంలో వివిధ శాఖల అధికారులు

ప్లాస్టిక్ రహిత సచివాలయం

- ప్రాంగణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వంద శాతం నిషేధించాం
- తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని సచివాలయ ప్రాంగణంలో వందశాతం నిషేధించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. శుక్రవారం సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని నిర్ణయించి, 45 రోజులు గడిచిన సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ.. డిసెంబర్ 3 నాటికి పూర్తిస్థాయిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా సచివాలయం మారనున్నదని తెలిపారు. సచివాలయ ప్రాంగణంలో ప్రతి రోజూ 3 వేలకుపైగా సింగిల్ యూజ్ వాటర్ బాటిల్స్ వినియోగించే వారని, ఇప్పుడు పూర్తిగా తగ్గించినట్టు పేర్కొన్నారు. సచివాలయం ఆవరణలో స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు 32 ఆక్వాగార్డు వాటర్ డిస్పెన్సర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ అన్నిశాఖల హెచ్‌వోడీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీల్, పింగాణి వస్తువులను వినియోగించాలని సూచించారు. సచివాలయం ప్రాంగణంలో గ్రీన్ కియోస్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. సచివాలయ ప్రాంగణాన్ని జీరో వేస్ట్ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషిచేయాలని సూచించారు. కేవలం ప్రభుత్వ ఉత్తర్వులతో ఇది సాధ్యం కాదని, స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతతో పాటించాలని సూచించారు.

ఎన్ఎంసీ చిహ్నంపై వివాదం

ధన్వంతరి చిత్రంపై ఐఎంఏ కేరళ అధ్యక్షుడి అభ్యంతరం

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) చిహ్నంలో మార్పులపై వివాదం రేగింది. ఎన్ఎంసీ లోగోలో తాజాగా చేసిన మార్పులు ఆమోదయోగ్యం కాదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కేరళ చాప్టర్ అధ్యక్షుడు గురువారం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. లోగోలో లౌకిక సందేశం ఉండి ఉంటే మరింత సమంజసంగా, ఆమోదయోగ్యంగా ఉండేదని తెలిపారు. ఐఎంఏ జాతీయ నాయకత్వం లోగో మార్పుపై తీవ్ర నిరసన వ్యక్తం చేయాలని కోరారు. గతంలో జాతీయ చిహ్నం(సారనాథ్ స్తూపం నుంచి తీసుకున్నది) లోగోలో ఉండేదని.. కానీ దాని స్థానంలో హిందూ దేవతల వైద్యుడైన ధన్వంతరిని ఫొటోను ఉంచారని ఆయన విమర్శించారు. దీనిపై ఎన్ఎంసీ నైతిక విలువలు, వైద్య రిజిస్ట్రేషన్ బోర్డ్ అధిపతి, మీడియా విభాగం అధిపతి యోగేందర్ మాలిక్ శుక్రవారం స్పందించారు. ధన్వంతరి చిత్రమున్న లోగోను ఏడాదికి క్రితం నుంచి వాడుతున్నామని.. ఇండియా పేరు స్థానంలో భారత్ అనే మార్పును మాత్రమే నెలన్నర క్రితం చేర్చామని తెలిపారు.

మహిళపైకి వేగంగా దూసుకెళ్లిన కారు

- అక్కడికక్కడే మృతిచెందిన కవిత
- కాజీపేట దర్గా రోడ్డులో దారుణం
- న్యాయం కోసం ఠాణా ముట్టడి
- ఫాతిమానగర్‌లో రాస్తారోకో
- రెండు గంటలకు పైగా ట్రాఫిక్‌జామ్

కాజీపేటలోని దర్గా రోడ్డులో సెయింట్ గాబ్రియల్ పాఠశాల గేట్ ఎదుట బైక్ ఎక్కుతున్న మహిళను అతివేగంగా ఢీకొట్టిన కారు సీసీ ఫుటేజీ, మృతురాలు కవిత (ఫైల్)

కాజీపేట, డిసెంబర్ 1: వరంగల్ నగరం కాజీపేట పట్టణంలోని దర్గా రోడ్డులో భర్త బైక్‌పై ఎక్కబోతున్న మహిళను అతివేగంగా ఓ కారు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన గురువారం ఉదయం జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ మృతురాలి కుటుంబీకులు, బంధువులు శుక్రవారం ఫాతిమానగర్‌లో రాస్తారోకో చేసి, కాజీపేట ఠాణాను ముట్టడించారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఫాతిమానగర్ శౌరీనగర్‌లో గెదె కవిత (38), జోసఫ్‌రెడ్డి దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసముంటున్నారు. కవిత నగరంలోని ప్రైవేట్ దవాఖానలో నర్సుగా, జోసఫ్‌రెడ్డి ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి పిల్లలు జోషిత 8వ తరగతి, భావన 2వ తరగతి చదువుతున్నారు. గురువారం పోలింగ్ ఉండగా జోసఫ్‌రెడ్డి పని చేసే పాఠశాలలోనే భార్యాభర్తలు ఓటేశారు. తిరిగి ఇంటికెళ్లే క్రమంలో పాఠశాల గేట్ ఎదుట కవిత తన భర్త జోసఫ్‌రెడ్డి బైక్ ఎక్కుతుండగా ఫాతిమానగర్ నుంచి దర్గా కాజీపేటకు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. కొంత దూరం కారు ఆమెను అలా ఈడ్చుకెళ్లింది. అక్కడే ఉన్న భర్త జోసఫ్‌రెడ్డి వెంటనే బైక్ దిగి తీవ్రగాయాల పాలైన కవితను దవాఖానకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యులు సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా కాజీపేట ఠాణాలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఠాణా ఎదుట ఆందోళన చేపట్టారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో ఆందోళనను విరమించిన బంధువులు, కుటుంబ సభ్యులు.. ఫాతిమానగర్ బ్రిడ్జి వద్ద దాదాపు 2 గంటలకు పైగా రాస్తారోకో చేశారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. నిట్ కళాశాల, కాజీపేట చౌరస్తా వరకు దాదాపు బ్రిడ్జికి ఇరువైపులా 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఏసీసీ భోజరాజు నేతృత్వంలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సీఐలు సుజాత, సార్ల రాజు, మడికొండ సీఐ వేణు, ఎస్సైలతోపాటు నగర పోలీసులు దాదాపు నాలుగు గంటలు పాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా టీఎస్ 03 ఎఫ్ఏ 9881 స్విఫ్ట్ డిజైర్ కారును గుర్తించామని, కారు అతివేగంగా నడిపి ప్రమాదానికి కారకుడైన దొడ్డ వంశీ భార్గవ్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. వంశీభార్గవ్ తండ్రి శరత్‌కుమార్ వరంగల్ అర్బన్ ఎక్సైజ్ పోలీస్ శాఖలో ఎస్సైగా పనిచేస్తున్నారు.

నాగర్‌కర్నూల్ చెరువులోకి దూసుకెళ్లిన వాహనం

అదుపు తప్పి చెరువులోకి..

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 1: అదుపుతప్పి తుఫాను వాహనం నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం చెరువులోకి దూసుకుపోయిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల అధికారికి తుఫాన్ వాహనాన్ని అద్దెకు ఉంచారు. డ్రైవర్ స్వగ్రామం ఎండబెట్ల కావడంతో గురువారం విధులు ముగించుకుని రాత్రి ఇంటికి బయలుదేరాడు. తెల్లవారుజామున నాగర్‌కర్నూల్ వస్తున్న క్రమంలో ఎండబెట్ల సమీపంలోని బ్రిడ్జి వద్ద వాహనం అదుపు తప్పి చెరువులోకి దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ మధు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడే చూడండి

సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
కుమార్ 70 - కాచిగూడ 11.30,2.30,6.30,9.30

INOX అశోక - వై.జంక్షన్ 6.45PM	Cinépolis డి.ఎస్.ఎల్.- ఉప్పల్ 8.00PM
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 4.55PM	ASIAN సినీ స్క్వేర్ - ఉప్పల్ 1.00PM
Cinépolis మంజీర మాల్ - కూకట్‌పల్లి 10.00AM	ASIAN ఎం.జె.ఆర్ - నారపల్లి 12.40PM
PVR ఫోరంమాల్ - కూకట్‌పల్లి 10.50PM	JP జెపి - చందానగర్ 4.10PM
PVR గల్లేరియా - పంజాగుట్ట 10.55PM	విజయలక్ష్మీ - ఎల్‌బినగర్ 11.15AM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 5.15PM	GPR జిపిఆర్ - కూకట్‌పల్లి 11.15PM
PVR పివిఆర్ - మూసారాంబాగ్ 12.40PM	PLATINUM ప్లాటినమ్ - అమీర్‌పేట్ 7.30PM
Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్ 10.10AM	PLATINUM ప్లాటినమ్ - గచ్చిబౌలి 8.30PM
Cinépolis CCPL - మల్కాజ్‌గిరి 5.45PM	

పివిఆర్ యస్2 ఎ/సి - వరంగల్	ఏషియన్ తిరుమల - సూర్యాపేట్	అన్నపూర్ణ ఎ/సి - జమ్మికుంట
ఏషియన్ శ్రీదేవి - హన్మకొండ	పివిఆర్ వేణు - నిజామాబాద్	ఆనంద్ ఎ/సి - భూపాలపల్లి
లక్ష్మీ ఎ/సి - మహబూబాబాద్	ఉషాప్రసాద్ ఎ/సి - నిజామాబాద్	మిరాజ్ ఎ/సి - రాయచూర్
పరమేశ్వరి ఎ/సి - కొత్తగూడెం	వెంకటేశ్వర - మంచిర్యాల	శివే 70 ఎ/సి - కొప్పల్
వెంకటేశ్వర ఎ/సి - కరీంనగర్	శాంతి ఎ/సి - పాల్వంచ	లక్ష్మీ 70 ఎ/సి - కర్తగి
న్యూఅశోక ఎ/సి - గోదావరిఖని	శ్రీరమణ - నాగర్‌కర్నూల్	కొడాలసంగమేశ్వర - సింధనూర్
శ్రీనివాస ఎ/సి - జగిత్యాల	వెంకటరమణ - జడ్చర్ల	శివమాత ఎ/సి - సిరివార్
ఎవిడి ఎ/సి - మహబూబ్‌నగర్	శ్రీదేవి 70 ఎ/సి - కొత్తకోట	అమర్ ఎ/సి - గంగావతి
వెంకటేశ్వర ఎ/సి - వనపర్తి	భువనేశ్వరి 70 ఎ/సి - ఐజా	శరణబసవేశ్వర ఎ/సి - మస్కి
యస్‌విసి మల్టీప్లెక్స్ - గద్వాల్	వెంకటరమణ - సిర్పూర్‌కాగజ్‌నగర్	ఆనంద్ ఎ/సి - దేవదుర్గ్
పివిఎన్ సినీమ్యాక్స్ - నల్గొండ	కమల 70 ఎంఎం ఎ/సి - బైంసా	నంది ఎ/సి - కనకగిరి
వెంకటేశ్వర ఎ/సి - కోదాడ		మారుతి ఎ/సి - కుష్టిగి